# నేనూ - నా కూలి పని

మూడు నెలలయింది. అతడు నన్ను వదిలేసి వెళ్ళిపోయాడు. ఇప్పుడు నేను ఒంటరిదాన్ని. ఏమాటా చెప్పకుండా వెళ్ళిపోయాడు. అంతకుముందు కొన్నాళ్ళు మానసిక సంక్షోభంలో తల్లడిల్లిపోతూ కనిపించేడు. పని నుంచి ఇంటికి రాగానే ఏదో తినేసి చూరు కింద మంచం వాల్చుకుని పడుక్కునేవాడు. గదిలోకి వచ్చేవాడు కాదు. ఎన్నిసార్లు ఎన్ని విధాలుగా ఎలా అడిగినా, ఏమీ చెప్పేవాడు కాదు. తను పనిచేస్తున్న గ్యారేజీ యజమానితో తగువుపడ్డాడా? తోటి పనివాళ్ళతో దెబ్బలాట జరిగిందా? అప్పులిచ్చినవాళ్ళు అల్లరిపెడుతున్నారా? మరెవరితోనైనా తగువు వచ్చిందా? ఏ సమస్యలోనైనా చిక్కుకు పోయాడా? ఎన్నిసార్లు ఎలా అడిగినా ఏమీ చెప్పలేదు. అయితే అలాంటిదేమీ జరగలేదని నా మనసు నాకు చెప్పింది. చీమ కుట్టినా చెప్పే మనస్తత్వం కలవాడు. అలాంటివేమైనా ఉంటే చెప్పకుండా ఉండలేడు. ఏ మాటా చెప్పకుండా వెళ్ళిపోయాడు.

★ ★ ★

పెళ్ళయిన కొత్తలో జల్సా చేసి వున్నదంతా ఆర్పేశాడు. చేతి అప్పులు కూడా చేసేడు. ఒద్దని చెప్పినా వినలేదు. ఇలాంటిరోజులు మళ్ళీ రావు కదా అని చిరునవ్వు నవ్వుతూ చెప్పేవాడు. ఇంతకీ పెళ్ళయి ఎంతోకాలం అవే లేదు. రెండేళ్ళయింది. పిల్లలు వెంటనే వొద్దని అల్లరి పెడుతూ వుండేవాడు. ఇంట్లో ఇబ్బందులు ఎక్కువైపోయాయి. అతడికి జీతం ఎంతో రాదు. నెలకి వెయ్యి కూడా రాదు. వచ్చింది అప్పులు తీర్చడానికే చాలదు. ఇల్లు ఎలా గడుస్తుంది? నేను కూడా పనిచేసి సంపాదించాలనుకున్నాను. ఆ మాట అతడితోనూ, అతడి అక్కతోనూ చెప్పేను. తప్పనిసరి ఇంటి పరిస్థితుల్లో వొప్పుకున్నారు. అయితే - చదువుకున్న దానివి కూలిపని చేస్తావా? అని అడిగేరు. 'చేస్తాను. తప్పా? నా చదువుకి కుర్చీ ఉద్యోగం రాదు' అని చెప్పేను. మా వదిన నన్ను దుర్గారావు దగ్గరికి తీసుకువెళ్ళింది. దుర్గారావు ఇళ్ళు కట్టడానికి లేబరు కంట్రాక్టులు చేస్తూ వుంటాడు. దుర్గారావు చాలా విషయాలు చెప్పేడు. ఆ మాటలు బట్టి కూలిపని కూడా ప్రతిరోజూ దొరకడం కష్టం అని తెలుసుకున్నాను. మా వదిన దుర్గారావు దగ్గర పాతికేళ్ళు పనిచేసింది. ఆమె మాట కొట్టేలేక నన్ను పనిలోకి రమ్మన్నాడు.

★ ★ ★

నేను రోజూ పనికి వెళుతున్నాను. ఆ పనిలో మొత్తం పదిమంది చేస్తున్నారు. ఇద్దరు వయసులో వున్న మేస్త్రీలూ - ఒక ముసలి మేస్త్రీ - ముగ్గురు మగకూలీలు - నలుగురు ఆడకూలీలూ - ఆ పనిలో పనిచేస్తున్నారు. పెద్ద భవనం కట్టడానికి రెండేళ్ళు పడుతుంది.

పెత్తనం సత్యం మేస్త్రీ చేతిలో ఉంది. స్కూలు ఫైనలు పరీక్ష పాసయ్యాడు. ఏ ఉద్యోగం దొరక్క తాపీ పనిలో చేరాడు. పని బాగా తెలిసినవాడు. దుర్గారావుకు కుడిభుజం లాంటివాడు. దుర్గారావుకి పని దగ్గర కూర్చోడానికి వీలుపడదు. పనులు సంపాదించడం కోసం తిరుగుతూ ఉంటాడు. సత్యంకి ఎడంకన్ను మెల్ల. ఎటువేపు చూస్తున్నాడో తెలుసుకోవడం కష్టం. కంతిరీ గోడని అందరూ అంటూ వుంటారు. పనే కాకుండా, పెత్తనం చెలాయించడం కూడా బాగా తెలిసినవాడు. పెళ్ళయింది. పిల్లలు కూడా ఉన్నారు. వయసు ముప్ఫై ఏళ్ళు. రమణ వయసు ఇరవై దాటి ఉంటుంది. పదోక్లాసు పాసయ్యాడు. నేరోకట్ పాంటూ, అడ్డగీతల బనీనూ, నల్లటద్దాల కళ్లజోడూ, గుడ్డజోళ్ళూ వేసుకుంటూ చురుగ్గా ఉంటాడు. క్లాస్ మేస్త్రీనని అనుకోడమే కాకుండా అందరికీ అలా చెబుతూ ఉంటాడు. రోజూ సినిమా చూస్తూ ఉంటాడు. సినిమా పాటలు పాడుతూ, డైలాగులు చెబుతూ, నవ్వుతూ, అందర్నీ నవ్విస్తూ పనిచేస్తూ ఉంటాడు. అందరితోనూ గౌరవంగా మాట్లాడుతూ - అందర్నీ ఆకట్టుకునే స్నేహస్వభావం కలవాడు.

★ ★ ★

పనిలో చేరిన కొద్దిరోజుల్లోనే ఆడకూలీలు చేయవలసిన పనులు నేర్చుకున్నాను. సిమెంటు తొట్టెలు పని దగ్గర అమర్చడం, ఇసుక, సిమెంటు గమేళాలతో కొలిచి కావలసిన పాళ్ళల్లో కలపడం, కలిపిన సిమెంటు గమేళాలతో మోసి తొట్టెల్లో వేయడం, ఇసుక జల్లించడం, ఇటికెలూ, రాళ్ళూ మోయడం, ఏభై కేజీల సిమెంటు బస్తాలు మోయడం, నీళ్ళలో సిమెంటు పోసి ఒంద్రు కలపడం - నీళ్ళు మోయడం, కట్టిన గోడలు తడపడం - లాంటి పనులన్నీ చేస్తున్నాను. ఆ పనులు చేయడం కష్టంగా నేను అనుకోలేదు. ఆ పనులన్నీ ఉత్సాహంగా నేను చేస్తున్నాను. అయితే టీ అందియ్యి - జేబులోంచి బీడీ తీసియ్యి - అగ్గిపెట్టె అందుకో - మంచినీళ్ళు ఇయ్యి - క్యారేజీ గిన్నెలు కడుగు - లాంటి పనులు మేస్త్రీలు ఆడకూలీలకు చెబుతూ ఉంటారు. అలాంటి పనులు ఎందుకు చెయ్యాలి? ఆడకూలీలే ఎందుకు చేయాలి? ఆ ప్రశ్నలు నాలో తలెత్తాయి.

ఎన్నో వికృత చేష్టలు మగకూలీలూ - మేస్త్రీలూ చేస్తూ ఉంటారు. బూతు మాటలు విసురుతూ ఉంటారు. ఉదయం పనికి వెళ్ళగానే పనికి సర్దుకుంటాం. కొప్పులు బిగువుగా ముడిచుట్టుకుంటాం. కాళ్ళకి అడ్డుపడకుండా, కోక ముడుకుల మీదకు ఎత్తి, వెనక్కి మడిచి, గోచీలా దోపుకుంటాం. తొంగి తొంగి చూస్తూ అవమానకరమైన మాటలు విసురుతూ ఉంటారు. తట్టలూ - గమేళాలు బుర్రకు ఎత్తేటప్పుడు ఎవరూ చూడకుండా చేతులు గుండెల మీదకు విసురుతూ ఉంటారు. ఇటికలూ, నీళ్ళూ అందించేటప్పుడు చూసీ చూడనట్లు చేతులు పట్టుకొని నొక్కుతూ ఉంటారు. కాలు ముడుచుకోడానికి చెట్ల చాటుకి వెళుతూ ఉన్నప్పుడు పిచ్చికూతలు కూస్తూ ఉంటారు.

అయితే - ఆడకూలీలు నవ్వుతూ తిడుతూ ఉంటారు. లేదా తిడుతూ నవ్వుతూ ఉంటారు. ఆ దృశ్యాలు నా గుండెల్లో మంటలు రేపుతున్నాయి. ఆడకూలీలు ఎందుకలా ఊరుకుంటున్నారో నేను తెలుసుకోలేకపోయాను. గవిరెమ్మ చెప్పింది. మొగోళ్ళతో చెబితే బుర్రలు బద్దలు గొట్టుగుంటారు. అంతటితో ఆగిపోదు. ఆడదాన్నే అనుమానిస్తూ ఉంటారు. ఎవరితోనూ చెప్పకుండా చెప్పట్టుకు కొట్టేస్తే, పనినుండి మాన్పించి పొమ్మండమే కాకుండా, నష్టపోయేది ఆడదే అవుతుంది. పరపురుషుడి వాసన కూడా తగలకుండా ఆడది పవిత్రంగా వుంటూ, కూలి చేసి డబ్బు సంపాదించి సంసారాన్ని నడపడమే కాకుండా, తాగడానికి డబ్బు అందివ్వాలని అనుకునే మొగుళ్ళు! గవిరెమ్మ చెప్పిన మాటల్లో నిజాన్ని నేను చూసేను. పనిలో ఒళ్ళు చిదిగిపోయి, అవమానంతో మనసు మండిపోయి చస్తున్నా, రాత్రి మొగుడి పక్కలోకి సర్దుకోకపోతే, దెబ్బలాటే జరిగిపోతుందట! ఇంటి ఓనర్లు కూడా తక్కువవాళ్ళు కారు. కొరకొర చూస్తూ ఉంటారు. అవకాశం కోసం అన్వేషిస్తూ ఉంటారు. మోటు సరుకులో గొప్ప సుఖం ఉంటుందని అనుకుంటూ నవ్వుకుంటూ ఉంటారు. డబ్బుతో ఏదైనా కొనుక్కోగలమని అనుకుంటారు!

ఆరునెలల్లో నాలో చాలా మార్పులు వచ్చేయి. తెల్లగా - యవ్వనంతో నిగనిగలాడే నేను నల్లనల్లగా మాడిపోయాను. చెమటతో సిమెంటు కలిసి చర్మాన్ని కొరుక్కు తినడంవల్ల, చర్మం బీటలు దేరి మోటుగా మారిపోయింది. పాదాలు కొట్టుకుపోవడం వల్ల గాలిగా నడిచే నేను గానుగెద్దులా నడుస్తున్నాను. చేతిలో బొబ్బలు లేచిపోయి, చర్మం బిగుసుకుపోయి గట్టిగా తయారైంది. జుత్తు వూడిపోతూ, చీక్కుపోయి తుప్పలా తయారైంది. నా శరీరంలో వచ్చిన మార్పులు చూసి, అతడు ప్రేమతో నా శరీరాన్ని నిమురుతూ ఉండేవాడు. చర్మంలో పగుళ్ళు పోడానికి

మందులు తెచ్చి రాస్తూ వుండేవాడు. అయితే - నా మనసులో ధైర్యం - శక్తి పెరుగుతూ వస్తున్నాయి.

★ ★ ★

ఒకరోజు ఉదయం సత్యంతో నాకు దెబ్బలాట జరిగింది. కోక మడిచి సర్దుకుంటున్నప్పుడు తప్పు మాట విసిరేడు. కాలి చెప్పు తీసి మీద పడి కొట్టేను. ఆడకూలీలందరూ అదే తగిన సమయం అనుకుని చెప్పులతో కొట్టేరు. జుత్తు పీకేసారు. బట్టలు చింపేసారు. రమణ చెప్పుతీసి కొట్టలేదు గానీ ఈల వేస్తూ తప్పట్లు కొట్టేడు. సత్యం నోరు విప్పలేదు. మెల్లకన్ను మిటకరిస్తూ, కన్నీళ్ళు జలజల రాల్చేడు. చెంపలు వాచిపోయాయి. ముక్కు నుండి రక్త కారింది. ఆ రోజు నుంచీ సత్యం నా విషయంలో జాగ్రత్తగా ప్రవర్తిస్తున్నాడు. ఆడకూలీలలో కొంతమార్పు వచ్చింది. ఎవడు అసభ్యంగా మాట్లాడినా - ప్రవర్తించినా తిరగబడుతున్నారు.

★ ★ ★

ఆరోజు నుంచీ సత్యం నా మీద పగబట్టాడు. పని నుంచి మాన్పించి పంపించేయమని దుర్గారావుతో చెప్పేడు. నా వల్ల పని దెబ్బతింటోందని చెప్పేడు. అయితే, పనికి రావొద్దనిగానీ, ఆనాటి సంఘటన గురించి గాని దుర్గారావు ఎప్పుడూ నాతో మాట్లాడలేదు. ఆడకూలీల కష్టాలు తన విశాలమైన జీవితంలో కళ్ళతో చూసిన మనిషి దుర్గారావు. ఆరోజు నుంచీ సత్యాన్ని రెండు కళ్ళతో కనిపెడుతున్నాను. నాకు రమణతో సంబంధం ఉందని అతడితో చెప్పి, అతడి మనసు పాడుచేసి, నా సంసారంలో మంటలు పెడతాడని అనుకున్నాను. అలాంటి ఆలోచన సహజంగానే నాలో రేగింది. ఏ పరపురుషుడి వాసనా తగలకుండా నేను మాత్రం పవిత్ర పుష్పంలా వుండాలని అతడూ కాంక్షిస్తాడు. అతడలా వుంటాడా? నా తండ్రి తెలుగు పండితుడు. చిన్నప్పటినుంచీ తెలుగు నేర్పాడు. ఎన్నో పుస్తకాలు చదివించేడు. వాటి ప్రభావం ఆనాడు నామీద పడలేదు. అయితే - ఇప్పటి జీవితం - అప్పటి చదువూ - కలిపి చూస్తే - మన వ్యవస్థలో పురుషుడు 'స్త్రీ'ని సొంత ఆస్తిగా భావిస్తాడు కాబట్టి - భార్య పవిత్ర పుష్పంగా ఉండాలని కూడా కాంక్షిస్తాడని అనుకున్నాను. నేను అనుకున్నట్లు సత్యం అలాంటి పొరపాటు పని చేయలేదు. అలాచేస్తే, రమణ చావుదెబ్బలు కొడతాడని భయపడ్డాడు. నేను చెప్పుదెబ్బలు కొడతానని భయపడ్డాడు. దెబ్బలకు భయపడతారు గానీ, నీతి,

న్యాయం, ధర్మం, మానవత్వం వీటికి ఎవరూ భయపడరు. అతడు - ఇప్పుడతణ్ణి నా భర్తగా చెప్పుకోలేకపోతున్నాను. అందుకే అతడనే చెప్తున్నాను. అతడు చాలా మంచివాడు. సున్నితమైన మనస్సు. ఏ వ్యసనం లేదు. ఏ లోపం లేని నిండు పురుషుడు. ఎప్పుడూ నా మీద చికాకు పడలేదు. కసరలేదు. ఏ తప్పూ పట్టలేదు. నామీద ప్రేమతో - అభిమానంతో - గౌరవంతో సహజీవనం చేసేడు. అతడలా ఎందుకు వెళ్ళిపోయాడో?!

★ ★ ★

మా చదువులికి కుర్చీ ఉద్యోగాలు రావని సత్యం, రమణా, నేనూ కూడా తెలుసుకున్నాం. మా పదోక్లాసు చదువులికి కుర్చీ ఉద్యోగాలు ఎలా వస్తాయి? కాలప్రవాహంలో 'చదువు-శ్రమ' సంబంధంలో వచ్చిన మార్పు గుర్తించేం. అలాగే 'కులం-శ్రమ' సంబంధంలో వచ్చిన మార్పుని కూడా గుర్తించేం. 'చదువు-కులం' ఏ శ్రమకీ అడ్డుగా నిలబడకూడదని నిర్ణయించుకున్నాం. ఏ రకం శ్రమనీ చిన్నచూపు చూడకూడదనీ, శ్రమలో విలువా - సౌందర్యం - ఆత్మవిశ్వాసం - వుంటాయని అర్థం చేసుకున్నాం. పురుషుడి మీద ఆర్థికంగా ఆధారపడి, పరాన్నభుక్కురాలిగా బతికే జీవితంలో సౌందర్యం వుండదనీ, హింస మాత్రమేఉంటుందని కొంతవరకూ నేను తెలుసుకున్నాను. అందుకే - కూలిపనిలో చేరిపోయాం. నిజమైన శ్రమను చిన్నచూపు చూనన్నా, చదువు -కులం నిర్మించిన అడ్డుగోడలను దాటలేకపరాన్నభుక్కులుగా జీవితాన్ని గడపడం - శవజీవితమే గానీ సౌందర్య పూరితమైన శ్రమజీవితం కాదనీ తెలుసుకున్నాను.

★ ★ ★

నేనెప్పుడూ అతడి మీద ఆర్థికంగా ఆధారపడలేదు. పెళ్ళికాక ముందు వ్యవసాయంలో పనిచేస్తూ కొంత సంపాదించేను. ఆ తర్వాత కూలిచేస్తూ సంపాదిస్తున్నాను. అప్పులన్నీ తీర్చివేసాం. ఇంట్లోకి కావలసిన పాత్ర సామాన్లూ - బట్టలూ కూడా కొనుక్కున్నాం. ఆర్థికంగా కొంతవరకూ నిలదొక్కుకున్నాం. ఆర్థిక ఇబ్బందుల వల్ల అప్పుల బాధలవల్ల అతడలా వెళ్ళిపోలేదు.

★ ★ ★

సత్యం తన మరదలు పెళ్ళికి విజయవాడ వెళ్ళి వచ్చేడు. అతణ్ని కలుసుకున్నాడట. గ్యారేజీలో పనిచేస్తున్నాడట. అంతకంటే సత్యం మరేమీ

చెప్పలేదు. 'నన్ను చెప్పుతో కొట్టేవు! నీకేమి మరింక చెప్పను' అని మనసులో వున్నమాట దాచకుండా చెప్పేసేడు.

★ ★ ★

రమణ అసలు విషయం తెలుసుకోడానికి విజయవాడ వెళ్ళేడు. వెళ్ళేముందు ఆ విషయం నాకు చెప్పలేదు. అతడు ఆరోగ్యంగా, సంతోషంగా ఉన్నాడనీ, ఏ అమ్మాయినీ లేవదీసుకు పోలేదనీ, ఏ పరస్త్రీతోనూ సంబంధాలు లేవనీ చెప్పేడు. అతడెందుకు అలా వెళ్ళిపోయాడో చెప్పలేదని కూడా రమణ చెప్పేడు.

ఆరోజు రమణ నన్ను ఆశ్చర్యంలో ముంచేస్తూ కొన్ని ప్రశ్నలు అడిగేడు. కఠినమైన ప్రశ్నలు వేసేడు.

'ఎవరిమీదా ఆర్థికంగా ఆధారపడకుండా శ్రమించి నీ జీవితాన్ని నువ్వు గడుపుతున్నావు? అయితే – నీకు స్వేచ్ఛ ఉందా?'

'లేదు!'

'ఎంచేత?'

'పరపీడనవల్ల!'

'సమాజం సూర్యుడు లాంటిది. కుటుంబం – వ్యక్తి – చంద్రుడు లాంటివారు. సమాజంలో స్వేచ్ఛ లేనిదే – కుటుంబంలో – వ్యక్తిలో – స్వేచ్ఛ ఉండదు. భర్త నుంచి హింస లేకుండా, నీ కాళ్ళమీద నువ్వు నిలబడి నీ జీవితాన్ని నువ్వు గడపగల శక్తిమాత్రమే నీకు ఉంది. నీకున్నది చాలా చాలా పరిమితమైన స్వేచ్ఛ'.

సినిమా కబుర్లతో కాలక్షేపం చేసే రమణ సామాజిక అవగాహన నాకు ఆశ్చర్యం కలిగించింది. శ్రమ అతడిలో సామాజిక విలువలు పెంచుతోంది.

'అతడు ఎందుకు వెళ్ళిపోయాడో చెప్పనా?'

'చెప్పు!'

'పురుషుడు – స్త్రీ కంటే అధికుడిగా ఉండాలి. స్త్రీ పురుషుడి మీద ఆర్థికంగా కూడా ఆధారపడి ఉండాలి. స్త్రీని బయటకు పనికి పంపించకుండా ఆమెను

పోషించే సమర్థత పురుషుడికి ఉండాలి - లాంటి మన వ్యవస్థలోని స్వభావానికి అతడు బలైపోయాడు. అది శ్రమ స్వభావానికి విరుద్ధమైంది. నువు కూలిపనిచేస్తూ అతణ్ని ఆదుకోవడం వల్ల తన్ను తాను అసమర్థుడిగా గుర్తించుకొని తనలోని విశ్వాసాన్ని పోగొట్టుకున్నాడు!'

'నేను కూలి పని చేయకుండా - కుర్చీ పని చేస్తే, అతడలా అనుకోడా? నిజమైన శ్రమని చిన్నచూపు చూడడం కూడా మన వ్యవస్థ స్వభావమే కదా!'

రమణ జవాబు చెప్పకుండా వెళ్ళిపోయాడు.

★ ★ ★

అతడు తనలో తన మీద విశ్వాసాన్ని పోగొట్టుకున్నాడు. నా మీద ఏ రంకూ మోపలేదు. పరస్పర విశ్వాసం లేని సహజీవనం దుర్భరమైంది. అతడు మంచి పనే చేశాడు. నేను ఎప్పుడో అప్పుడు చేయకతప్పని పని అతడు ముందుగానే చేసాడు. అవును. మంచి పనే చేసాడు. అతడు మళ్ళీ వస్తే చెప్పుతీసి కొడ్తాను!!

ఎందుకంటే - పురుషాధిక్యత నుండి అతడు విముక్తి అయితే సరిపోదు! సమాజమే విముక్తి కావాలి!

★ ★ ★

(1. ఆంధ్రభూమి - ఆదివారం దినపత్రిక - 21.09.1997)

(2. హిందీలోకి అనువాదం : వివరణ పత్రిక - మాసపత్రిక - డిసెంబరు 2002 - డా॥ ఎస్. పద్మావతి)